
సాక్షి
బాపట్ల
మంగళవారం । 24 । డిసెంబర్ । 2024



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 1902 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1410 క్యూసెక్కులు వదిలారు.



అమరేశ్వరుని సేవలో ఎస్పీ

అమరావతి: అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరుని సోమవారం ఎస్పీ కంది శ్రీనివాసరావు కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 576.30 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,298 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

అవినీతి ఆర్‌ఐను బదిలీ చేసిన ఆర్డీఓ

సాక్షి ఎఫెక్ట్

చీరాల టౌన్: చీరాల మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ ప్రతి పనికి పైసలు వసూలు చేస్తున్న అవినీతి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగకుమార్‌ను ఎట్టకేలకు చీరాల నుంచి బదిలీ చేశారు. చీరాల మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐగా పనిచేస్తున్న నాగకుమార్ అవినీతిపై సాక్షి పత్రికలో ఈనెల 4న 'పైసలు ఇవ్వు-పత్రం పట్టు' అనే కథనాన్ని ప్రచురించింది. కథనంలో వచ్చిన అంశాలపై చీరాల రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ టి.చంద్రశేఖర్‌నాయుడు ఆదేశాలతో లోతుగా విచారణ చేపట్టారు. పలువురు వీఆర్వోల నుంచి సమాచారాన్ని సేకరించారు. తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ పలు అంశాలను, వివరాలను ఆర్డీవోతో పాటుగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపించారు. దీంతో చీరాల మండల ఆర్‌ఐ విధుల నుంచి కుమార్‌ను తప్పించారు. డిప్యుటేషన్‌పై జిల్లాలోని వేరే మండలానికి బదిలీ చేశారు.

సమగ్రశిక్షలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి పోస్టులో ఫారిన్ సర్వీసు నిబంధనలపై డెప్యుటేషన్‌పై పని చేసేందుకు ఆసక్తి, అర్హతలు గల ఉపాధ్యాయులు ఈనెల 31లోపు దరఖాస్తు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న 55 ఏళ్లలోపు వయసు కలిగిన ఉపాధ్యాయులకు మాథ్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టుల్లో పీజీతోపాటు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పీజీడీసీఏ, డీసీఏ డిప్లొమా ఉండాలని సూచించారు. విద్యార్హతల జిరాక్స్ కాపీలతో ఈనెల 31వ తేదీలోపు డీఈవో కార్యాలయంలోని సమగ్రశిక్ష విభాగంలో సమర్పించాలని, పూర్తి వివరాలకు సమగ్రశిక్ష గుంటూరు.బ్లాగ్‌స్పాట్.కామ్ సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

పెరిగిన సత్రశాల ఆదాయం



రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద ఉన్న పురాతన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం ఆదాయం గత ఏడాది కన్నా పెరిగినట్టు దేవదాయ శాఖ సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ వి.లీలావతి, దేవస్థానం ఈఓ గాదె రామిరెడ్డి తెలిపారు. సోమవారం సత్రశాల దేవస్థానంలో హుండీ లెక్కించగా రూ.4,42,500 వచ్చినట్లు వివరించారు. గత ఏడాది రూ.3,69,000 రాగా ప్రస్తుతం రూ.73,500 అధికంగా ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. స్థానిక శివాలయంలో కార్తీకమాసంలో హుండీ ఆదాయం రూ.11,388 వచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో రెంటచింతల శివాలయం చైర్మన్ పల్లెర్ల లక్ష్మారెడ్డి, గుండా శివయ్య, మున్నా లింగయ్య, నీలం మల్లయ్య, అర్చకులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ టీచర్స్ ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్


గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని నగరపాలక సంస్థ, పురపాలక పాఠశాలల్లో పని చేస్తున్న ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీఈవోజీఎన్‌టీ.బ్లాగ్‌స్పాట్.కామ్ వెబ్‌సైట్‌లో ఉంచిన సీనియార్టీ జాబితాలో పొందుపర్చిన ఉపాధ్యాయులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీస్ రిజిస్టర్‌తో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు.

ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు మెడికల్: జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్, జాతీయ టీబీ నిర్మూలన కార్యక్రమంలో కాంట్రాక్టు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. డాట్ ప్లస్ టీబీ హెచ్ఐవీ సూపర్‌వైజర్ పోస్టు ఒకటి, టీబీ సెంటర్ స్టాటిస్టికల్ అసిస్టెంట్ పోస్టు ఒకటి, అకౌంటెంట్ పోస్టు ఒకటి, టీబీ హెచ్‌డీ ఎస్‌టీఎ పోస్టులు మూడు, డిస్ట్రిక్ ప్రోగ్రామ్ పోస్టు ఒకటి ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ దరఖాస్తు ఫారం, జీతాలు, ఇతర వివరాలకు గుంటూరు.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు. దరఖాస్తులను ఈనెల 24 నుంచి జనవరి 5 వరకు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా టీబీ అధికారిణిని 7780582555 నంబరులో సంప్రదించాలన్నారు.

మెటీరియల్ టెన్షన్!

- పదో తరగతి విద్యార్థులకు ఇంకా అందని స్టడీ మెటీరియల్
- డిసెంబర్ ముగుస్తున్నా చలనం లేని పాలకులు, అధికారులు
- 2022లో రాష్ట్రంలోనే తొలిసారిగా జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ
- ఈసారీ నవంబర్ 2న జెడ్పీకి మెటీరియల్ అందజేసిన విద్యాశాఖ
- టెండర్ల ఖరారు, ముద్రణలో జెడ్పీ పాలకుల తీవ్ర నిర్లక్ష్యం



జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ (ఫైల్)

గత రెండేళ్లు మెటీరియల్ పంపిణీ ఇలా..

సంవత్సరం	అందుకున్న విద్యార్థులు	ఖర్చుచేసిన మొత్తం(రూ.లక్షల్లో)
2022	36,155	61.80
2023	39,000	70.00

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సకాలంలో స్టడీ మెటీరియల్ అందించడంలో జెడ్పీ పాలకవర్గం, అధికార యంత్రాంగం విఫలమైంది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులతో అధిక మార్కుల సాధనకు దోహదం చేసేలా రూపొందించిన మెటీరియల్‌ను విద్యాశాఖాధికారులు గత నవంబర్ 2న జెడ్పీ పాలకవర్గానికి అందజేసినా, ఇప్పటికీ కనీసం ముద్రణకు నోచుకోలేని దుస్థితి నెలకొంది. స్టడీ మెటీరియల్ పంపిణీలో నెలకొన్న జాప్యంపై ఇటు పాలకవర్గం, అటు అధికారులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు.

వైఎస్ జగన్ హయాంలో రెండేళ్లపాటు నిరాటంకంగా..

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో వరుసగా రెండేళ్ల 'జగనన్న విద్యాజ్యోతి' పేరుతో నాణ్యమైన స్టడీ మెటీరియల్ రూపొందించి సకాలంలో పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేసిన జెడ్పీ పాలకవర్గం కూటమి ప్రభుత్వ పాలనలో తొలి ఏడాదే చతికిలబడింది. 2022 నవంబరులో 'జగనన్న విద్యాజ్యోతి' పేరుతో రూ.61.80 లక్షల జెడ్పీ నిధులతో రాష్ట్రంలోనే తొలిసారిగా గుంటూరు జిల్లా వ్యాప్తంగా 36,155 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. 2023 లోనూ రూ.70 లక్షల వ్యయంతో 39వేల మంది విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేశారు. ప్రస్తుతం మూడు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి పరీక్షలకు సన్నద్ధమవుతున్న 35వేల మంది విద్యార్థులకు రూ.70 లక్షల ఖర్చుతో స్టడీ మెటీరియల్ పంపిణీకి గత జెడ్పీ సర్వసభ్య సమావేశంలోనే నిర్ణయం తీసుకున్నా ఆచరణలోకి రాలేదు. మార్చి 17 నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదలైంది. విద్యాశాఖ రూపొందించిన మెటీరియల్‌ను నవంబర్ 2న జెడ్పీకి అందజేసినా టెండర్లను పిలిచి, సకాలంలో ముద్రణ చేయించడంలో జెడ్పీ పాలకవర్గం, అధికార యంత్రాంగం విఫలమయ్యాయి.

విద్యార్థులు నష్టపోతున్నారు

టెన్త్ విద్యార్థులకు డిసెంబర్ 15లోపు స్టడీ మెటీరియల్ ఇస్తామని హామీ ఇచ్చిన జెడ్పీ పాలకవర్గం, అధికారులు ఆచరణలో విఫలమయ్యారు. జనవరిలో ఇచ్చినా, స్టడీ మెటీరియల్ ఆధారంగా పరీక్షలకు సన్నద్ధం కావడం విద్యార్థులకు సాధ్యపడదు. వెంటనే ఇచ్చే ఏర్పాట్లుచేయాలి.

– కేఎస్ లక్ష్మణరావు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ

నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

- జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి
- ప్రజల నుంచి అర్జీలు స్వీకరణ

బాపట్లటౌన్: ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక భవనంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. రీ ఓపెన్ అర్జీలకు మాత్రమే పరిష్కారం చూపుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలు పరిష్కరించి వాటిని స్క్రీన్‌పై అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. అర్జీలను పూర్తిస్థాయిలో విశ్లేషించుకుని పరిశీలించాలన్నారు. జిల్లాలో హౌస్ హోల్డ్ సర్వేను ఈనెలాఖరు నాటికి పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. సర్వే పూర్తి చేయని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జేసీ ప్రఖర్ జైన్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, బాపట్ల ఆర్డీఓ పి.గ్లోరియా, డీఆర్‌డీఏ పీడీ పద్మావతి, డ్వామా పీడీ ఎ.విజయలక్ష్మి ఉన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ జె వెంకటమురళి



పోరుబాట బ్రోచర్ ఆవిష్కరిస్తున్న పార్టీ అధ్యక్షుడు మేరుగ నాగార్జున, నియోజకవర్గాల సమన్వయకర్తలు వరికూటి అశోక్‌బాబు, ఈవూరి గణేష్, యడం బాలాజీ

విద్యుత్ చార్జీలపై వైఎస్సార్ సీపీ పోరుబాట

- పేదలకు వరుసగా షాక్‌లు ఇస్తున్న కూటమి సర్కార్
- కరెంట్ బిల్లులు తగ్గించమంటే కాల్పులు జరిపిన ఘనుడు చంద్రబాబు
- 27న నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళన
- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున
- బ్రోచర్ ఆవిష్కరించిన నాయకులు

బాపట్లటౌన్: పేద ప్రజల రక్తాన్ని పీల్చుకుంటున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున అన్నారు. విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాటకు సిద్ధమైందన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో పోరుబాట బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 27న జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. పార్టీ అధ్యక్షులు మేరుగ నాగార్జున మాట్లాడుతూ నియోజకవర్గంలోని పార్టీనాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి ఆయా నియోజకవర్గాల విద్యుత్ శాఖాధికారులకు పేద ప్రజలపై మోపుతున్న అదనపు భారాన్ని వెంటనే తగ్గించాలని కోరుతూ పేదల పక్షాల వినతిపత్రాలు అందజేయాలన్నారు. ఎన్నికల ప్రచారంలో ఎలాంటి బిల్లులు పెంచమని, మేము అధికారంలోకి వస్తే ప్రజలే విద్యుత్‌ను ఉత్పత్తిచేసి అమ్మేపరిస్థితిని తీసుకువస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే తన నిజ స్వరూపాన్ని చూపిస్తూ పేద ప్రజల రక్తాన్ని పీల్చుకుంటున్నారన్నారు. విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ 2000 సంవత్సరంలో చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టిన ప్రజలపై బషీర్‌బాగ్‌లో కాల్పులు జరిపించిన ఘనుడు చంద్రబాబు అన్నారు. చార్జీల బాదుడుపై చంద్రబాబు ద్వంద్వ వైఖరిని తూర్పారపట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. చార్జీల పెంపును ఉపసంహరించుకొనే వరకు వైఎస్సార్ సీపీ పేదల పక్షాన పోరాడుతూనే ఉంటుందన్నారు. ఎన్నికల్లో పేదలకు హామీ ఇచ్చిన పథకాలు ఇవ్వకపోగా, ప్రజల నుంచే వసూళ్లకు దిగిన ఘనుడు చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త ఈవూరి గణేష్, పర్చూరు సమన్వయకర్త యడం బాలాజీ, వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, బాపట్ల పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మండల అధ్యక్షులు కోకి రాఘవ రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ వడ్డిముక్కల డేవిడ్, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, విద్యార్థి విభాగం అధ్యక్షులు యల్లావుల సోహిత్, పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షులు జోగి రాజా, దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య, మహిళా విభాగం నాయకురాలు గొర్రుముచ్చు పుష్పరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

పట్టాలపై ప్రాణాలు

- రైలు పట్టాలపై బలవన్మరణాలు
- రైలు ప్రమాదాల్లో పెరుగుతున్న మృతులు
- ఆత్మహత్యలు సరైన నిర్ణయం కాదు
- ఏడాదిలో 70 మంది దుర్మరణం



వేటపాలెంలో ఇటీవల రైలు కింద పడి మృతిచెందిన యువతి



గేటు కిందగా బైక్‌ని దూర్చి తీసుకెళ్తున్న యువకుడు

వేటపాలెం: కష్టాలను అధిగమించలేక కొందరు.. సమస్యలకు పరిష్కార మార్గం దొరకలేదని మరికొందరు రైలు కిందపడి బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. విద్యార్థులు చిన్న విషయానికి కూడా ఆత్మహత్యలకు పాల్పడుతూ కన్న వారికి కడుపుకోత మిగుల్చుతున్నారు. ప్రేమ విఫలమైందని కొందరు... ప్రేమ పెళ్లికి కన్నవారు అంగీకరించలేదని మరి కొందరు రైలు కిందపడి ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు ఉన్నాయి. వారం కింద గుంటూరులో ప్రేమ జంట ఇంట్లో తల్లిదండ్రులు పెళ్లికి అంగీకరించలేదని రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డారు. పదిరోజుల కింద వేటపాలేనికి చెందిన ఇద్దరు మనస్పర్థలతో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. బాపట్ల రైల్వేస్టేషన్ నుంచి సింగరాయకొండ రైల్వేస్టేషన్ వరకు 2023 నుంచి డిసెంబర్, 2024 వరకు దాదాపు 70 మంది రైలు ప్రమాదాలలో మృతి చెందిన వారున్నారు. నెలకు సగటున 7 నుంచి 10 మంది వరకు రైలు కింద పడి మృతి చెందుతున్నారు.

అందరూ ఉన్నా అనాథలే..

విజయవాడ–చెన్నై రైలు మార్గంలో నిత్యం ఎన్నో రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. రద్దీ కారణంగా జనరల్ బోగీల్లో ఫుట్‌పాత్‌పై కూర్చొని ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రయాణికులు ప్రయాణిస్తూంటారు. ఈ నేపథ్యంలో కొందరు అలా ప్రయాణిస్తూ రైలు నుంచి జారి పడి మృత్యువాత పడుతున్నారు. ఇలా మృతి చెందిన వారి వివరాలు లభించవు. ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తుతెలియని మృతదేహాలుగా కేసులు నమోదవుతున్నాయి. ఇటీవల ఇతర రాష్ట్రాలకు చెందిన వారు జారి పడి మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. ఇలా మరణించిన వారిలో కొందరి వద్ద దొరికిన చిన్నచిన్న ఆధారాలతో మృతదేహాలను వారి ఇళ్లకు చేర్చేందుకు జీఆర్పీ పోలీసులు ప్రయత్నిస్తున్నారు. శరీరం బాగానే ఉంటే వారి ఫొటోలను పరిసర ప్రాంతాల పోలీస్‌స్టేషన్లకు పంపుతుంటారు. కొన్ని మృతదేహాలు ఛిద్రమై గుర్తుపట్టలేనంతగా మారతాయి. వాటిని స్థానికంగానే ఖననం చేస్తున్నారు.

భద్రపర్చడం కష్టమే..

పట్టాలు దాటుతూ రైలు ఢీకొని మృతి చెందిన వారి మృతదేహాలు కూడా ఒక్కోసారి ఛిద్రమై పోవడంతో వారు స్థానికులైనా గుర్తుపట్టడం ఇబ్బందిగా ఉంటుంది. దీంతో అనాథ శవాలుగా మిగిలిపోతున్నాయి. ఆత్మహత్యలు చేసుకొనే వారు అనేక మంది ఉన్నారు. రైలు ప్రమాదాల్లో మృతి చెందిన వారి మృతదేహాలను పోస్టుమార్టం కోసం చీరాల ఏరియా వైద్యశాలకు తరలిస్తుంటారు. రైలు ప్రమాదాల్లో మరణించిన వారి శరీరం రెండు, మూడు రోజులకే కుళ్లిపోతుంది. పోస్టుమార్టం చేసినా వాటిని భద్రపరిచేందుకు చీరాల ఏరియా వైద్యశాలలో ఫ్రీజర్ బాక్సులు లేకపోవడంతో వాటిని మార్చురీలోనే ఉంచుతున్నారు. మూడు రోజుల దాటినా వారి తరపున ఎవరూ రాకపోవడంతో జీఆర్పీ పోలీసులే వాటిని ఖననం చేయిస్తుంటారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఇటువంటి ప్రమాదాలు జరుగుతుంటాయని జీఆర్పీ పోలీసులు చెబుతున్నారు.

జాగ్రత్తలతో ప్రమాదాలు నివారించవచ్చు..

ప్రయాణికులు రైల్వేస్టేషన్‌లలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై నుంచి ప్లాట్ ఫారం దాటి వెళ్లకుండా పట్టాలు దాటుతుంటారు. రైలు గేటు వద్ద కొందరు వాహనదారులు గేటు కిందగా వారి వాహనాలు తీసుకొని వెళ్తుంటారు. ఇలాంటి సమయాల్లో ఎక్కువగా రైల్వే ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ మధ్య ప్రేమికులు, ఇంట్లో వివిధ సమస్యలతో చిన్నచిన్న కారణాలతో క్షణికావేశంతో రైలు కింద పడుతున్నారు. ఈ కేసులు పెరుగుతున్నాయి.

– కొండయ్య, ఎస్సై జీఆర్పీ, చీరాల



దీక్ష విరమణకు తరలివస్తున్న భవానీలు



దారులన్నీ అమ్మ సన్నిధికే..

- కొనసాగుతున్న భవానీల రద్దీ
- భక్తిశ్రద్ధలతో భక్తుల గిరిప్రదక్షిణ
- రేపటితో దీక్షల విరమణ పరిసమాప్తం



చిన్నారితో దీక్ష విరమణకు వచ్చిన భవానీమాలధారి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కొలువైన ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్ష విరమణ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మ దర్శనానికి తరలివస్తున్న భవానీ మాలధారులతో వీధులన్నీ పోటెత్తుతున్నాయి. దారులన్నీ అమ్మసన్నిధికే అన్న చందంగా కనిపిస్తున్నాయి. ఉత్సవాల్లో మూడో రోజైన సోమవారం తెల్లవారుజామున మూడు నుంచి నుంచి రాత్రి 11 గంటల వరకు భవానీలను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. భవానీలు అధిక సంఖ్యలతో తరలిరావడంతో వినాయకుడి గుడి వద్ద క్యూలైన్‌లోకి ప్రవేశించినప్పటి నుంచి కొండ దిగువన లడ్డూ కౌంటర్‌కు చేరేందుకు మూడు గంటల సమయం పడుతోంది. రాత్రి తొమ్మిది నుంచి 11 గంటల వరకు గిరి ప్రదక్షిణ మార్గంలో భవానీల రద్దీ కనిపించింది. రైళ్లు, బస్సులు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రవాణా వాహనాల ద్వారా నగరానికి చేరుకుంటున్న భవానీలు తొలుత పద్మావతి, సీతమ్మ వారి పాదాలు, భవానీ, పున్నమి ఘాట్లలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. అనంతరం దుర్గ గుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం వద్ద పూజలు నిర్వహించి గిరి ప్రదక్షిణ ప్రారంభిస్తున్నారు. రైల్వేస్టేషన్, బస్టాండ్‌కు వచ్చే భవానీల సంఖ్యను పోలీసు శాఖ ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ఆలయ ప్రాంగణంలో అధికారులకు సమాచారం అందిస్తోంది.

దీక్ష విరమణల్లో నేడు కీలకం

భవానీ దీక్ష విరమణలు కీలక ఘట్టానికి చేరుకున్నాయి. దీక్ష విరమణలు బుధవారం ఉదయం 11 గంటలకు పూర్ణాహుతితో ముగియనున్నాయి. ఈ నేపథ్యలో మంగళవారం భవానీలు భారీగా తరలివచ్చే అవకాశం ఉందని పోలీసు, రెవెన్యూ, దేవదాయ శాఖ అధికారులు భావిస్తున్నారు. మంగళవారం సెంటిమెంట్‌గా దీక్షలను విరమించరనే అభిప్రాయం ఉన్నా సాయంత్రం నుంచి గిరిప్రదక్షిణ చేసుకుని బుధవారం ఉదయం దీక్షలను విమరించే అవకాశం ఉందని గురుభవానీలు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం నుంచి భవానీల తాకిడి పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. రద్దీ నేపథ్యంలో మంగళ, బుధవారం చేపట్టాల్సిన ఏర్పాట్ల గురించి ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు ఆలయ అధికారులతో చర్చించారు. కీలకమైన ప్రాంతాల్లో సోమవారం ఈఓ, డీఈఓ రత్నరాజులు మరోమారు పర్యటించి సిబ్బందికి సూచనలు చేశారు. భవానీలు ఇరుముడులను సమర్పించే కౌంటర్లు, హోమగుండాలు, అన్నదానం, లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రాలతో పాటు లడ్డూ తయారీ పోటును పరిశీలించారు. మంగళవారం ఒక్క రోజే సుమారు లక్షన్నర నుంచి రెండు లక్షల మంది గిరి ప్రదక్షిణ చేసే అవకాశం ఉందని పోలీసు శాఖ భావిస్తోంది.



దీక్షలు విరమిస్తున్న భవానీమాలధారులు

గిరి ప్రదక్షిణ మార్గంలో ఆధ్యాత్మిక శోభ

శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి కొండ చుట్టూ భవానీలు గిరి ప్రదక్షిణ చేపడుతున్నారు. భవానీలతో ఈ మార్గంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తోంది. కుమ్మరిపాలెం మొదలు నాలుగు స్తంభాల సెంటర్, చెరువు సెంటర్, సితార జంక్షన్, కబేళా, పాలప్రాజెక్టు, కేటీరోడ్డుతో పాటు బ్రాహ్మణ వీధిలో అమ్మవారి ప్రతిమలను ఏర్పాటు చేసి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. భక్తులు గిరి ప్రదక్షిణ చేపట్టిన భవానీల సేవలో తరిస్తున్నారు. బిస్కెట్లు, పాలు, పండ్లు, అల్పాహారం, భోజనాలను అందిస్తున్నారు.

క్లుప్తంగా

జాతీయ రహదారిపై లారీ దగ్ధం



గుంటూరు రూరల్: జాతీయరహదారిపై వెళుతున్న లారీ ఒక్కసారిగా ఇంజిన్‌లో మంటలు రేగి దగ్ధమైన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం పేరేచర్ల నుంచి ఆటోనగర్‌లోని లారీ షోరూంకు వెళుతున్న టిప్పర్‌లారీ ఒక్కసారిగా మంటలు రేగటంతో డ్రైవర్ అప్రమత్తమై లారీనుంచి దిగిపోయాడు. వెంటనే ఫైర్ సిబ్బందికి పోలీసులు సమాచారం అందించటంతో సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ట్రాఫిక్ రెండుగంటలపాటు నిలిచిపోయింది. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నల్లపాడు పోలీసులు తెలిపారు.

హెల్మెట్ లేకుంటే 'యమ' డేంజర్!

హెల్మెట్ ధారణపై యముడి వేషధారణలో వినూత్న ప్రచారం



పట్నంబజారు: హెల్మెట్ అనేది ప్రతి ఒక్కరికీ ప్రాణాపాయ పరిస్థితుల్లో రక్షణ కవచం వంటిదని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ చెప్పారు. సోమవారం ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోని ట్రాఫిక్ సీఐ ఎ.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో హిందూ కళాశాల కూడలి ప్రాంతంలో హెల్మెట్‌పై స్పెషల్ డ్రైవ్ జరిగింది. దానిలో భాగంగా యమధర్మరాజు వేషధారణలో వ్యక్తి హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో జిల్లా సతీష్‌కుమార్ స్వయంగా హాజరై అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో అధికంగా తలభాగానికి గాయాలు అవడం వల్లే మృత్యువాత పడుతున్నారని తెలిపారు. ఏఎస్పీ ఎ.హనుమంత్, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

విశ్రాంత అధ్యాపకుల సంఘ రాష్ట్ర కమిటీ ఎన్నిక

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఆంధ్రప్రదేశ్ కళాశాల విశ్రాంత అధ్యాపకుల సంఘం రాష్ట్ర కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్‌వీ కృష్ణారావు (విజయవాడ) ఎన్నికయ్యారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఆ సంఘం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక ప్రక్రియ సోమవారం జరిగింది. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జె.గంగాధరరావు(చీరాల), ప్రధాన కార్యదర్శిగా జీఆర్‌కే రెడ్డి(విజయవాడ), అసోసియేట్ సెక్రటరీగా వీవీ రమణ(విజయవాడ), ఫైనాన్స్ సెక్రటరీగా ఆర్‌ఎల్ నరసయ్య(కర్నూలు), సలహాదారులుగా ఆర్.వెంకటేశ్వరెడ్డి(కర్నూలు), పీవీ లక్ష్మీపతి(విశాఖపట్నం) ఎన్నికయ్యారు.

నా పేరు బొనిగల మాణిక్యమ్మ, నాది చుండూరు మండలం పెనుగుద్దురుపాడు గ్రామం. నా వయస్సు 70 సంవత్సరాలు. నా భర్త ఏసుపాదం



కాలం చేశారు. నాకు ముగ్గురు కొడుకులు, వారిలో రెండో కుమారుడు విజయవాడలో, చిన్నబ్బాయి బెంగుళూరులో ఉంటారు. పెద్ద కుమారుడు శామ్యూల్, అతని భార్య కుమారి నా వద్దనే ఉంటున్నారు. నా పేరుతో ఉన్న ఆస్తి తనకు రాయాలని నిత్యం ఒత్తిడి చేస్తున్నారు. ఈ క్రమంలో నన్ను చంపాలని చూస్తున్నారు. ఈ విషయంపై చుండూరు పోలీస్‌స్టేషన్ చుట్టూ నెలల తరబడి తిరుగుతున్నా ప్రయోజనం లేదు. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని భయంగా ఉంది. ఇది ఓ వృద్ధ మహిళ ఆవేదన.



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్‌డూడీ

కన్న కొడుకే కడతేర్చాలని చూస్తున్నాడు

అర్జీలు స్వీకరించిన ఎస్పీ తుషార్ డూడీ

బాపట్లటౌన్: నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని కొందరు... క్షేత్రస్థాయిలో సిబ్బంది పట్టించుకోవడం లేదని మరికొందరు ఎస్పీ తుషార్ డూడీ ముందు వాపోయారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి బాధితులు హాజరయ్యారు. 46 మంది ఎస్పీని కలసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. బాధితుల సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్న ఎస్పీ తుషార్ డూడీ సంబంధిత స్టేషన్ ఎస్‌హెచ్‌వోలతో మాట్లాడారు. సమస్యలు పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు.

పైరును నాశనం చేసి.. చంపాలని చూస్తున్నారు

నాపేరు కుంచాల అంకమ్మ, నాది బల్లికురవ మండలం చెన్నాపల్లి గ్రామం. నాకు మా గ్రామంలోని సర్వే నెంబర్ 47లో 72 సెంట్ల పొలం ఉంది. నా కొడుకు హైదరాబాద్‌లో ఉంటాడు. కొంతకాలం నుంచి మా గ్రామానికి చెందిన కుంచాల పద్మ, తంగిరాల సుబ్బారావులు కబ్జా చేయాలని చూస్తున్నారు. దానిలో భాగంగా నా పొలంలో సాగులో ఉన్న తెల్లజొన్న పైరును నాశనం చేసి దౌర్జన్యంగా దాంట్లో మొక్కజొన్న నాటారు. ఇదేమని అడిగితే నన్ను చంపేందుకు ప్రయత్నిస్తున్నారు. నేను 70 ఏళ్ల వృద్ధుడిని. నాకు రక్షణ కల్పించి, నా పొలాన్ని కాపాడాలి.

– కుంచాల అంకమ్మ,
చెన్నాపల్లి, బల్లికురవ మండలం

నా భార్యను కిడ్నాప్ చేశారు..



నాపేరు రెడ్డి శ్రీనివాసరావు, నాది చుండూరు మండలం మండూరు గ్రామం. నేను మా గ్రామానికి చెందిన అశ్వినిని ప్రేమించి మూడు నెలల కిందట వివాహం చేసుకున్నాను. ఆమె చెన్నైలో చదువుకుంటుంది. నాలుగు రోజుల కిందట మా గ్రామానికి చెందిన కొమ్మూరి ఉలక్కరావు, రాజేంద్రలు చెన్నైలో చదువుకుంటున్న నా భార్యను కిడ్నాప్ చేశారు. వారి బారినుంచి నన్ను కాపాడాలంటూ నా భార్య నాలుగురోజుల కిందట చివరిసారిగా ఫోన్‌చేసింది. అప్పటినుంచి ఆమె ఆచూకీ తెలియడం లేదు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. రెండు రోజుల కిందట మా ఇంటికి వచ్చి నాపై దాడిచేశారు. నన్ను చంపుతామని బెదిరించారు. వారి వలన నాకు, నా భార్యకు ప్రాణహాని ఉంది. వారి చెరనుంచి మమ్ములను కాపాడాలి.

నా భర్త నన్ను చంపాలని చూస్తున్నాడు



నాపేరు కరుణ, నాది వేటపాలెం మండలం రామన్నపేట గ్రామం. నాకు 13 సంవత్సరాల కిందట మచిలిపట్నం మండలం కప్పలదొడ్డి గ్రామానికి చెందిన శ్రీనివాసులుతో వివాహం అయ్యింది. నాకు ఇద్దరు కుమార్తెలు. మేము 12 సంవత్సరాలుగా హైదరాబాద్‌లోనే స్థిరపడ్డాం. పెళ్లి సమయంలో నా తల్లిదండ్రులు నగదు, బంగారం కట్నంగా ఇచ్చారు. ఏడాదిన్నర కిందట పుట్టింటి నుంచి రూ.10 లక్షలు డబ్బులు తీసుకురావాలని ఒత్తిడి చేయడంతో గ్రామంలో అప్పులు చేసి మరీ తీసుకెళ్లి ఇచ్చాను. తాజాగా మూడు నెలల కిందట మరో రూ.10 లక్షలు తీసుకువస్తావా...లేదా అంటూ గొంతునులిమి చంపబోయాడు. భయంతో నేను నా పుట్టింటికి వచ్చాను. ఇప్పటికి కూడా నన్ను చంపాలని చూస్తున్నారు. నా భర్త చెరనుంచి నన్ను రక్షించి నా బిడ్డలకు న్యాయం చేయండి.

సౌత్ జోన్ ఖోఖో పురుషుల జట్టు ఎంపిక

జే.పంగులూరు: సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో పురుషుల జట్టు ఎంపిక నిర్వహించారు. ఈనెల 27 నుంచి 31 వరకు తమిళనాడులోని తిరుప్పూర్‌లో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో టోర్నమెంట్ జరగనున్నట్లు ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఐ దేవీవరప్రసాద్ తెలిపారు. పోటీల్లో పాల్గొనే ఆంధ్ర కేసరి యూనివర్సిటీ, ఒంగోలు ఉమ్మడి ప్రకాశం జిల్లా పురుషుల జట్టు ఎంపిక పంగులూరులోని స్థానిక జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించారు. ఈ ఎంపికలో ప్రకాశం జిల్లా డిగ్రీ కళాశాల, బీపీఈడీ కళాశాల నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో 15 మందిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. యూనివర్సిటీ ఆవిర్భావం తరువాత మొట్టమొదటి సారిగా ఖోఖో జట్టును పంపుతున్నట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ యూర్తి, రిజిస్ట్రార్, ప్రొఫెసర్ బీ హరిబాబు పేర్కొన్నారు. జట్టు ఎంపికలో యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్, పరిశీలకుడిగా జీ సాయిసురేష్, సెలక్షన్ కమిటీ మెంబర్లు పాల్గొని జట్టును ఎంపిక చేశారు.



ఎంపికైన ఏకే యూనివర్సిటీ పురుషుల ఖోఖో జట్టు

ఏకే యూనివర్సిటీ పురుషుల జట్టు..

వివేకానంద బీపీఈడీ కాలేజీ, పొదిలి విద్యార్థులు జీఎస్‌వీ శివ, షేక్ అహ్మద్, ఏ వీరాంజనేయులు, కే రామ్మోహన్, యూ గణేష్, బీ లక్ష్మీనారాయణ సిద్ధమూర్తి (బీపీఈడీ కాలేజ్, సింగరాయకొండ), డీసీఆర్ఎం డిగ్రీ కాలేజీ ఇంకొల్లుకు చెందిన క్రీడాకారులు పీ గోపి, ఎం ప్రసాద్, వై సుధీర్, కె వెంకటరావు, ఎస్ షాలేమ్‌రాజు, జే వినయ్, ఐ ఏలియ, వీ సిద్ధుప్రసాద్, ఎం మంత్రునాయక్ ఎంపికయ్యారు.

పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జీల పదవీ కాలం పొడిగింపు

రొంపిచర్ల: జిల్లాలోని 59 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (ప్యాక్స్)కు ప్రభుత్వం అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జీల పదవీ కాలాన్ని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పల్నాడు జిల్లాలో 60 ప్యాక్స్ ఉండగా 59 ప్యాక్స్‌లకు పీఐసీలను నియమించారు. సహకార శాఖలో పనిచేస్తున్న అధికారులనే ప్యాక్స్‌కు పీఐసీలుగా నియమించారు. ఈ మేరకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఉదయగిరి నాగశ్రీనివాస్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నియామకాలు ఆరు నెలల పాటు లేదా ఎన్నికలు జరిగే అంతవరకూ కొనసాగుతాయని తెలిపారు.

ప్రతి పైసాకు బాధ్యత వహించాలి

నీటియాజమాన్య సంస్థ జిల్లా పీడీ ఎం.సిద్ధలింగమూర్తి

రెంటచింతల: గ్రామాలలో చేపట్టిన వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించి క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి పైసాకు బాధ్యత వహించాల్సి ఉంటుందని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జిల్లా నీటియాజమాన్య సంస్థ ఎం.సిద్ధలింగమూర్తి అన్నారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద 16వ విడతకు సంబంధించి నిర్వహించిన సామాజిక తనిఖీ– ప్రజా వేదికకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో గ్రామాలలో చేసిన ఉపాధి హామీ పథకం పనులు, పంచాయిరాజ్ శాఖ, హౌసింగ్ అంశాలపై గ్రామాలలో ఈ నెల 16 నుంచి 22 వరకు క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. తనిఖీలలో మండలంలోని 11 గ్రామాలకు సంబంధించి మొత్తం రూ. 1,07,824 రికవరీ చేయడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా విజిలెన్స్ అధికారి విజయకుమారి, ఎంపీడీఓ కె.సరోజినిదేవి, ఎస్ఆర్పీ జేఎస్ రాజు, ఏపీఓ జయచంద్ర కుమార్, సర్పంచ్ గొట్టం ప్రమీల గురవారెడ్డి, కార్యదర్శులు, ఉపాధి, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ

రేపల్లెరూరల్: వ్యవసాయ సహాయకులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వై.రామకృష్ణ అన్నారు. నైపుణ్య పద్ధతులు పెంపొందించుకునే విధానంపై డివిజన్ పరిధిలోని రేపల్లె, నగరం, చెరుకుపల్లి, నిజాంపట్నం, భట్టిప్రోలు, కొల్లూరు, వేమూరు మండలాలకు చెందిన వ్యవసాయ సహాయకులకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక కాలంలో వ్యవసాయంలో రోజురోజుకు పెరుగుతున్న పలు పద్ధతులు తెలిసి ఉండాలన్నారు. సాగులో రైతులకు సహకారాలు అందిస్తూ రైతులు అధిక ఉత్పత్తులు సాధించే విధంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను సైతం రైతులకు వివరించాలన్నారు. 2024–25 సంవత్సరంలో సాగుపై రుణాలు పొందిన, పొందని ప్రతి రైతు బ్యాంక్‌లో పీఎం ఫసల్ బీమా యోజన పథకం ప్రీమియం చెల్లించేలా చూడాలని సూచించారు. రైతులను జాయింట్ లైబుల్డ్ గ్రూపులుగా ఏర్పాటు చేసి రుణాలు ఇప్పించాలన్నారు. ధాన్యం కొనుగోలులో ప్రతి రైతుకు మద్దతు ధర దక్కేలా చూడాలని సూచించారు. అనంతరం వ్యవసాయ సహాయకులు వృత్తిలో నైపుణ్యాలు పెంపొందించుకునే విధానాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్, ఏరువాక కేంద్రం బాపట్ల కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.బాలమురళీధర్ నాయక్, ఏఈవో గౌస్‌బాషా, రేపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్.విజయ్‌బాబు, ఏడు మండలాల వ్యవసాయ అధికారులు, ఏఈవోలు, ఎంపీఈవోలు, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

26న కాకినాడలో సీపీఐ శత జయంత్యుత్సవాలు

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాంగాంజనేయులు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాంగాంజనేయులు పక్కన సీపీఐ నాయకులు

భట్టిప్రోలు: భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతిని పురస్కరించుకుని ఈనెల 26న కాకినాడలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాంగాంజనేయులు తెలిపారు. భట్టిప్రోలులోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ 99 ఏళ్లు పూర్తి చేసుకుని నూరవ సంవత్సరంలో అడుగిడుతున్నట్లు చెప్పారు. నాటి నుంచి భారత గడ్డపై ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి ప్రజలకు అండగా నిలిచిందన్నారు. ఆ త్యాగాలను స్మరించుకుంటూ రానున్న కాలంలో పేదల పక్షాన పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. ప్రజా పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని, కమ్యూనిస్టులు లేకుండా పోరాటాలు లేవని అన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు బి.శ్రీనివాసరావు, జి.బాలాజి, చేతి వృత్తిదారుల సమాఖ్య సభ్యులు వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ రంగం ప్రైవేటీకరణ సరికాదు

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు



పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

బాపట్లటౌన్ విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేయటం సరికాదని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు నిరసనగా సోమవారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం దేశంలో విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేయాలని తీవ్రంగా ప్రయత్నం చేస్తుందన్నారు. చండీఘర్, ఉత్తరప్రదేశ్, తెలంగాణలో డిస్కంలను ప్రైవేటుపరం చేసి అదానికి కట్ట పెట్టాలని ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఇప్పటికే స్మార్ట్ మీటర్లు బిగించి వినియోగదారులపై భారం మోపుతున్నారని, విద్యుత్‌ను ప్రైవేటు మార్గంలో పయనించటానికి ప్రయత్నాలు ప్రారంభించిందన్నారు. విద్యుత్తు రాబోయే కాలంలో అంగడి సరుకుగా మారిపోతుందన్నారు. దీనిద్వారా దేశంలో అదానీలాంటి పెద్ద బడా పెట్టుబడిదారులకు లబ్ధి చేకూర్చడం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. ఉత్తరప్రదేశ్, చండీఘర్‌లో విద్యుత్ కార్మికులు చేస్తున్న పోరాటానికి సీఐటీయూ సంపూర్ణ మద్దతు అందిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే విద్యుత్తు ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్, బాపట్ల పట్టణ కార్యదర్శి జై శామ్యూల్ నాయకులు శరత్, యు శామ్యూల్, వీరాస్వామి, ప్రభాకర్, మారుతి పాల్గొన్నారు.

వైభవంగా వీవీఐటీ వార్షికోత్సవం



ప్రతిభ కనపరచిన విద్యార్థినులకు షీల్డ్ అందజేస్తున్న వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్



ప్రతిభ కనపరచిన విద్యార్థులకు షీల్డ్ అందజేస్తున్న వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: వీవీఐటీలో సంపూర్ణ క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తున్నట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల 17వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం మనసులను హత్తుకుంది. చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ సంపూర్ణ క్రమశిక్షణ, సంపూర్ణ విద్య నినాదంతో విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. కళాశాల విద్యార్థులు అన్నిరంగాలలో రాణించి విజేతలుగా ఎదగడం సంతోషం కలిగించినదన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల సంఘం ద్వారా ప్రస్తుత విద్యార్థుల భవిష్యత్ ప్రణాళికలకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహాదేవ్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లిఖార్జునరెడ్డి 2023–24 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్‌ను అందచేశారు. ఈవిద్యాసంవత్సరంలో మెరుగైన ఉత్తీర్ణతా శాతాన్ని సాధించిన విభాగంగా కంప్యూటర్‌సెన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్(సీఎస్ఎం), అకడమిక్స్ టాపర్‌గా విద్యాయేతర (క్రీడ, సాంస్కృతిక) అంశాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విభాగం కంప్యూటర్ సైన్స్– ఐటటీ అండ్ సైబర్ సెక్యూరిటీ విత్ బ్లాక్చైన్ టెక్నాలజీ (సిఐసి) రోలింగ్ షీల్డ్‌లను దక్కించుకున్నాయి.

అవిశ్రాంత సాహితీ శ్రామికుడు 'పెనుగొండ'

గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఘనసత్కారం



పెనుగొండ లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న అభ్యుదయ కవి పాపినేని శివశంకర్, కేఎస్ లక్ష్మణరావు, సత్యాజీ

లక్ష్మీపురం: అవిశ్రాంత సాహితీ శ్రామికుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అని, ఆయనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కడం గర్వకారణమని అభ్యుదయ కవి పాపినేని శివశంకర్ అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అధ్యక్షతన గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం, సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో అభినందన సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పాపినేని శివశంకర్ మాట్లాడుతూ పెనుగొండకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కడం రాష్ట్రానికి, గుంటూరు సీమకు గర్వకారణమన్నారు. గత 40 ఏళ్లుగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో సాహిత్య రంగంలో అనేక పెడధోరణలు వ్యక్తమవుతూ కలుషితమవుతున్న నేపథ్యంలో అభ్యుదయ సాహిత్యానికి గుర్తింపు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పెనుగొండ లక్ష్మీనారాయణ ఇటీవల రాసిన గుంటూరు సీమ సాహిత్య చరిత్ర అనే గ్రంథంలో అనేక విషయాలు వెల్లడించారన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యాజీ మాట్లాడుతూ పెనుగొండ లక్ష్మీనారాయణకు దక్కిన అవార్డు కష్టజీవులకు వచ్చిన అవార్డేనని అభ్యుదయ సాహిత్యానికి లభించిన గుర్తింపన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా పుట్టిన గడ్డ, అనేక అభ్యుదయ, ప్రజా ఉద్యమాలకు పుట్టినిల్లుగా వున్న వినుకొండలో జన్మించడం వల్ల జాషువా ప్రభావం కూడా పెనుగొండపై ఉందన్నారు. అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అభ్యుదయ రచయితల సంఘం, ప్రజానాట్య మండలి సాంస్కృతిక పునరుజ్జీవనానికి, సాహిత్య సాంస్కృతిక రంగాలలో కమ్యూనిస్టు పార్టీ గొప్ప కృషి చేసిందని చెప్పేందుకు గర్వపడుతున్నామన్నారు. అభ్యుదయ రచయితల సంఘం మూలాలను పరిశీలిస్తే పేదల సమస్యల పరిష్కారం, అభ్యుదయ భావజాలాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడమేనని, తనకు దక్కిన పురస్కారం సమాజానికి దక్కడమేనన్నారు. గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు మాట్లాడారు. విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎంఆశిదాసు, విప్లవ రచయితల సంఘం నాయకుడు సి.యస్.ఆర్.ప్రసాద్, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

నల్లచట్టాలను దొడ్డిదారిన తేవాలనుకోవడం దుర్మార్గం

కేంద్రం తెచ్చిన నూతన బిల్లును రద్దు చేయాలని కోరుతూ రైతు సంఘాల నేతల నిరసన



వ్యవసాయ మార్కెటింగ్ నూతన బిల్లు పత్రాలను దహనం చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘ నాయకులు

లక్ష్మీపురం: రైతాంగ పోరాట ఫలితంగా మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు పరిచిన ప్రధాని నరేంద్ర మోదీ ఇదే చట్టాలను దొడ్డిదారిన వివిధ పేర్లతో మళ్లీ యావత్తు రైతాంగాన్ని దెబ్బతీసే విధంగా తీసుకురావడం చాలా దుర్మార్గమని జిల్లా రైతు సంఘం కార్యదర్శి కంచుమాటి అజయ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి అన్నారు. జాతీయ అగ్రికల్చర్ మిషన్ పేరుతో వ్యవసాయ మార్కెటింగ్‌ను దెబ్బతీసే విధంగా నూతన బిల్లు కాపీని గుంటూరు కలెక్టరేట్ ముందు సోమవారం రైతు, కార్మిక, ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో దహనం చేసి, నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులను కార్పొరేటర్ పరం చేసేందుకు 'నేషనల్ పాలసీ ఫ్రేమ్ వర్క్ అన్ అగ్రికల్చర్ మార్కెటింగ్' పేరుతో పెద్ద కుట్రతో నూతన చట్టాన్ని కేంద్రం తీసుకొచ్చిందన్నారు. వీటిని ఉపసంహరించుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు ఉల్లిగడ్డ నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు పాశం రామారావు, జొన్న శివశంకర్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు జగన్నాథం, కృష్ణ, విటల్ రెడ్డి పాల్గొన్నారు.

సేంద్రియ ఆహారంతోనే ఆరోగ్యం



పురస్కార గ్రహీతలతో డీజీపీ ద్వారకా తిరుమలరావు, ఏపీ వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తదితరులు

- డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు
- రైతునేస్తం ఫౌండేషన్ మిద్దెతోటల పురస్కారాలు ప్రదానం

గుంటూరు రూరల్: సేంద్రియ ఆహారంతోనే ఆరోగ్యంగా జీవించవచ్చని ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. సోమవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తుమ్మేటి రఘోత్తమరెడ్డి రైతునేస్తం మిద్దెతోటల పురస్కారాలు–2024 కార్యక్రమంలో డీజీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పాల్గొనటం సంతోషకరమన్నారు. ఇంట్లో మొక్కలు పెంచుకునే వారికి ప్రభుత్వం తరఫు నుంచి ప్రోత్సాహకాన్ని అందించడానికి తన వంతు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. పురస్కారాలు అందుకున్న వారందరికీ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రముఖ మిద్దెతోట నిపుణులు తుమ్మేటి రఘోత్తమరెడ్డి, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వేంకటేశ్వరరావు రైతులు, తదితరులు పాల్గొన్నారు.